
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 21 । జూన్ । 2025



చీనీ టన్ను రూ.26,770

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26,770, కనిష్టంగా రూ.4,800 ప్రకారం ధర పలికాయి.



మురుగునూ వదల్లేదు

హిందూపురం మున్సిపాలిటీలో డ్రెయినేజీల్లో పూడికతీత పేరుతో రూ.80 లక్షల స్వాహాకు తెరలేపారు. చేయని పనులకు బిల్లులు చేసుకునేందుకు ప్లాన్ వేశారు.

8లో

గరిష్టం/కనిష్టం
36.2°/22.6°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 16 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

భూముల సబ్ డివిజన్‌కు స్పెషల్ డ్రైవ్



జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: జాయింట్ పట్టాదారుల భూములను సబ్ డివిజన్ చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. సబ్‌డివిజన్ చేయించుకోవాల్సిన రైతులు ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జాయింట్ పట్టాదారులుగా నమోదైన రైతుల పేర్లపై భూమి విస్తీర్ణం ఎక్కువగా చూపుతుందని, దీంతో వారంతా 'అన్నదాత సుఖీభవ', 'తల్లికి వందనం' లాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందలేకపోతున్నారన్నారు. అందువల్లే భూముల సబ్ డివిజన్‌కు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. సబ్ డివిజన్ చేయించుకోవాల్సిన రైతులు రూ.50 రుసుం గ్రామ సచివాలయంలో చెల్లించి ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు 'పురం'లో అంతర్జాతీయ యోగా దినోత్సవం



ప్రశాంతి నిలయం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం 6 గంటలకు హిందూపురంలోని ఎంజీఎం మైదానంలో జిల్లా స్థాయి యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు.

రైలు ఢీకొని 33 గొర్రెల మృతి

సోమందేపల్లి: మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద రైలు ఢీకొని 33 గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... బ్రాహ్మణపల్లికి చెందిన మగ్గం అంజి గొర్రెల కాపరి. శుక్రవారం ఉదయం ఆయన తన గొర్రెలను మేత కోసం ఈదుళబలాపురం గ్రామం వైపు తీసుకువస్తున్నాడు. అయితే బ్రాహ్మణపల్లి రైల్వేగేట్ సమీపంలో గొర్రెలు రైలు పట్టాలు దాటుతుండగా.. విజయవాడ వైపు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ వేగంగా వచ్చి గొర్రెలను ఢీ కొంది. ఈ ఘటనలో 33 గొర్రెలు మృతి చెందాయి. తనకు రూ.4 లక్షల నష్టం వాటిల్లిందని అంజి వాపోయాడు. హిందూపురం రైల్వే పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు.



గత నెల 8న ధర్మవరం నుంచి బెంగళూరుకు అక్రమంగా తరలిస్తున్న 4 టన్నుల రేషన్ బియ్యాన్ని సోమందేపల్లి వద్ద జాతీయ రహదారిపై పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి బియ్యాన్ని పౌర సరఫరాలశాఖ అధికారులకు అప్పగించారు.



బత్తలపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన 750 కిలోల రేషన్ బియ్యాన్ని ఈ నెల 9న పోలీసులు పట్టుకున్నారు. కొందరు బియ్యం వ్యాపారులు పలువురి నుంచి కిలో రూ.18 ప్రకారం కొనుగోలు చేసి నిల్వ ఉంచగా.. పక్కా సమాచారంతో దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు.



గతేడాది డిసెంబర్ 20న కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న 62 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బత్తలపల్లి వద్ద విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న టాటా 407 వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.




గతేడాది డిసెంబరు 11న బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న 4.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు బత్తలపల్లి వద్ద పట్టుకున్నారు. అనంతపురం, రాప్తాడులో సేకరించి బెంగళూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో స్వాధీనం చేసుకున్నారు.

పచ్చనేత.. బియ్యం మేత

పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం పచ్చ నేతల జేబులు నింపుతున్నాయి. తమవాళ్లనే డీలర్లుగా నియమించుకున్న అధికార పార్టీ నేతలు.. టన్నుల కొద్దీ రేషన్ బియ్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నారు. అక్కడ సన్నబియ్యంగా రీసైక్లింగ్ చేసి మార్కెట్లో విక్రయిస్తున్నారు. జిల్లాలో రేషన్ దందా పెద్ద ఎత్తున సాగుతుండగా... అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు.

- జిల్లాలో జోరుగా రేషన్ బియ్యం దందా
- సిండికేట్‌గా ఏర్పడి సరిహద్దు దాటిస్తున్న పచ్చ నేతలు
- ప్రతి నెలా బ్లాక్ మార్కెట్‌కు 3 వేల టన్నుల బియ్యం
- రీసైక్లింగ్‌తో సన్నబియ్యంగా మార్చి మార్కెట్లోకి..
- నెలకు రూ.3 కోట్లపైనే అక్రమ ఆదాయం
- మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు



జిల్లాలో రేషన్‌కార్డులు	5,62,784
ప్రతి నెలా పంపిణీ చేసే బియ్యం	8,700 మెట్రిక్ టన్నులు
ఏఏవై కార్డుదారులకు పంపిణీ చేసే బియ్యం	49,863 కిలోలు
పీడీఎస్ కార్డుదారులకు పంపిణీ చేసే బియ్యం	2,36,610 కిలోలు
ఈ ఏడాది ఇప్పటి దాకా నమోదైన 6-ఏ కేసులు	18
అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం	2.03 టన్నులు
ప్రతినెలా అక్రమంగా హద్దు దాటుతున్న బియ్యం	3 వేల టన్నులు

సాక్షి, పుట్టపర్తి: రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువు దీరగానే..అధికార పార్టీ నేతలు అడ్డగోలుగా సంపాదించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలోనే కొందరు నేతలు పేదల నోటికాడ కూడును లాగేసుకుంటున్నారు. కొందరు డీలర్ల ద్వారా టన్నుల కొద్దీ బియ్యాన్ని సేకరిస్తున్నారు. మరికొందరు పేదలకు పదో పరకో అందించి బియ్యాన్ని సేకరిస్తున్నారు. అలా సేకరించిన రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి సన్నబియ్యంగా మళ్లీ ప్రజలకే అమ్ముతున్నారు.

సరిహద్దు దాటించి.. సన్నబియ్యంగా మార్చి..

జిల్లాలో 32 మండలాలుండగా.. 16 మండలాలు కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్నాయి. దీంతో రేషన్ దందా సులువుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. అక్రమార్కులు సరిహద్దుకు సమీపంలోని మండలాల్లోని రేషన్‌షాపుల నుంచి రాత్రికి రాత్రే రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. ఇక జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సేకరించిన బియ్యాన్ని ధర్మవరం, పెనుకొండ, కొత్తచెరువు, నల్లమాడ, సోమందేపల్లి తదితర ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి లారీల్లో కర్ణాటకలోని రైస్ మిల్లులకు తరలిస్తారు. ధర్మవరం నుంచి కొత్తచెరువు, గోరంట్ల మీదుగా కర్ణాటకలోని బాగేపల్లి తీసుకెళ్తున్నారు. మరికొన్నింటిని ధర్మవరం నుంచి ఎన్ఎస్ గేటు మీదుగా కర్ణాటకలోని పావగడకు తరలిస్తున్నారు.

ప్రతి నెలా రూ.3 కోట్ల దందా..

స్థానికంగా కిలో రేషన్ బియ్యాన్ని రూ.15 నుంచి రూ.20 లోపు కొనుగోలు చేసి... కర్ణాటకకు తరలిస్తారు. అక్కడ రైస్ మిల్లుల్లో రీసైక్లింగ్ చేసి సన్నబియ్యంగా మారుస్తున్నారు. సోనా మసూరి వంటి బ్రాండెడ్ బియ్యంలో కలిపి కిలో రూ.55 దాకా విక్రయిస్తున్నారు. ఇలా రేషన్ బియ్యం దందాలో ప్రతి నెలా రూ.3 కోట్ల వరకూ చేతులు మారుతున్నట్లు సమాచారం. ఇందులో ఎవరి వాటా వారికి వెళ్లినా.. ఒక్కో వ్యక్తికి సగటున రూ.5 లక్షల వరకూ మిగులుతున్నట్లు సమాచారం.

పంచనామాతోనే సరి..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతోంది. అడపాదడపా పోలీసులు కేసులు నమోదు చేసినా... ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం పంచనామా రాసి వదిలేస్తున్నారు. ఇందుకోసం భారీగానే మామూళ్లు ముట్టజెపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో రేషన్ బియ్యం దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది.

అక్రమార్కులను వదలం



రేషన్ బియ్యంతో వ్యాపారం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలే ప్రసక్తే లేదు. డీలర్లు గీత దాటినా వేటు తప్పదు. ఎక్కడైనా రేషన్ బియ్యం కొనుగోలు చేసినట్లు సమాచారం ఉన్నా, నిల్వలు ఉన్నట్లు సమాచారం ఇచ్చినా వెంటనే దాడులు చేసి స్వాధీనం చేసుకుంటాం. కేసులు నమోదు చేసి బియ్యం సీజ్ చేస్తాం. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.

– వంశీకృష్ణారెడ్డి, డీఎస్ఓ, పుట్టపర్తి

సేవలతో ప్రజాభిమానం పొందాలి

- రెవెన్యూ దినోత్సవంలో కలెక్టర్ టీఎస్ చేతన్



విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్లను సన్మానిస్తున్న కలెక్టర్ చేతన్, జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: రెవెన్యూ శాఖలోని ప్రతి ఉద్యోగి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలతో వారి అభిమానం పొందాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన రెవెన్యూ దినోత్సవంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిపాలనలో రెవెన్యూ శాఖ చాలా కీలకమన్నారు. రెవెన్యూ ఉద్యోగులు బాధ్యతగా పనిచేస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని, తద్వారా ప్రభుత్వానికీ మంచి పేరు వస్తుందన్నారు. రెవెన్యూ ఉద్యోగులంతా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని సేవలు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే పథకాల లబ్ధిని ప్రజలకు అందేలా చూడాలన్నారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ.. రెవెన్యూ ఉద్యోగులు చిత్తశుద్ధితో సేవలందించి శాఖ ప్రతిష్ట పెంచాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి విజయసారథి మాట్లాడుతూ..రెవెన్యూ ఉద్యోగులు తమ బాధ్యతలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అనంతరం రెవెన్యూ శాఖలో సేవలందించిన విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్లు అశోక్ గుప్త, నారాయణ స్వామిని సత్కరించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, రామసుబ్బయ్య, ఓఏ వెంకటరానాయణ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయం ఆవిరి



2024 ఏప్రిల్‌లో రాప్తాడుకు చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారానికి వచ్చారు. 'ఇక్కడ పొలాల్లోనే రైతులు కరెంటు ఉత్పత్తి చేసేలా చేసి, మిగులు కరెంటు ప్రభుత్వానికే అమ్మేలా చేస్తా' అన్నారు. కానీ ఈరోజు చూస్తే కరెంటు ఉత్పత్తి దేవుడెరుగు కరెంటు కోతలు ఇబ్బంది పెడుతున్నాయి. ఇళ్లకొచ్చే కరెంటు బిల్లులు చూసి సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు.

- సంపద సృష్టి కాదు ఆదాయం లేక అప్పులు చేస్తున్న దుస్థితి
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో భారీగా పడిపోయిన చిన్న మార్కెట్లు
- పంటలకు గిట్టు బాటు ధరలు లేక రైతులకు భారీగా నష్టాలు
- జీఎస్టీ వసూళ్లు దారుణంగా పడిపోయిన వైనం
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో మరింతగా పడిపోయిన ఆదాయం

సాక్షి ప్రతినిధి, అనంతపురం : సంపద సృష్టిస్తా అంటూ పదే పదే చెప్పే చంద్రబాబు మాటలకు.. చేతలకు పొంతన లేకుండా ఉంది. ఉమ్మడి జిల్లాలో సంపద మార్గాలు దేవుడెరుగు ఆదాయం లేక ప్రజలు అప్పులు చేసుకుంటున్న దుస్థితి నెలకొంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఏ రంగంలో చూసినా అప్పులే కానీ ఆదాయం లేని పరిస్థితి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు భారీగా నష్టపోయారు. కూరగాయల రైతులకు పెట్టుబడి కూడా తిరిగి రాలేదు. మరోవైపు భూముల క్రయ విక్రయాలు లేక జిల్లాలో రెవెన్యూ వనరులు భారీగా దెబ్బతిన్నాయి. రైతుల నుంచి సామాన్యుల వరకూ ఎక్కడా అప్పులు పుట్టని పరిస్థితి నెలకొంది.

కుదేలైన చిన్న మార్కెట్లు

అనంతపురం జిల్లా కేంద్రంలో కమలానగర్ మార్కెట్ అంటే చాలా పేరుంది. రోజూ కోట్లాది రూపాయల బిజినెస్ జరుగుతుంది. బట్టల నుంచి యాక్సెసరీస్ వరకూ ఇక్కడ దొరకని వస్తువేదీ ఉండదు. నాలుగైదు వేల షాపులకు మించి ఉంటాయి. కూటమి సర్కారు వచ్చిన తర్వాత కమలానగర్ బోసిపోయింది. షాపులో ఓనరు, వర్కరు మినహా ఎవరూ లేరని వాపోతున్నారు. గతంతో పోలిస్తే 50 నుంచి 60 శాతం పైగా బిజినెస్ తగ్గిపోయిందని వ్యాపారులు వాపోతున్నారు.

రిజిస్ట్రేషన్లు పడిపోయాయి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికీ క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్ల పరిస్థితి దారుణంగానే ఉంది. స్థలాలు, ప్లాట్‌లు, అపార్ట్‌మెంట్‌లు కొనుగోలు చేయాలంటేనే భయపడుతున్నారు. రెండు జిల్లాల్లోనూ సుమారు రూ.650 కోట్ల వసూళ్ల లక్ష్యం కాగా రూ.400 కోట్లు కూడా చేరుకోలేక పోయారు. ప్రభుత్వానికి ఇదే పెద్ద ఆదాయ వనరు. కానీ ఈ రంగం ఇప్పుడు కుదేలైంది.

పరిశ్రమల ఆదాయం డౌన్

గడిచిన ఏడాది కాలంలో పరిశ్రమల నుంచి వచ్చే ఆదాయం భారీగా పడిపోయినట్టు తేలింది. ప్రముఖంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు కియా సంస్థ నుంచి ఒక్క రూపాయి కూడా ట్యాక్సు రూపంలో రాలేదని జీఎస్టీ అధికారులు చెబుతున్నారు. చిన్న పరిశ్రమలు రాలేదు. దీంతో ఆదాయమూ లేదు, ఉద్యోగాలు అంతకంటే లేవు అని నిరుద్యోగులు గగ్గోలు పెడుతున్నారు.

ఉద్యాన పరిస్థితి అధ్వానం

రాష్ట్రంలోనే ఉద్యాన పంటల్లో అనంతపురం జిల్లా అగ్రగామి. అలాంటిది ఈ ఏడాది ఏ పంటకూ గిట్టుబాటు ధర లేక ఆదాయం ఘోరంగా పడిపోయింది. మిరప, అరటి, చీనీ, మామిడితో పాటు టమాట లాంటి వాటి రేట్లు నేలచూపు చూశాయి. దీంతో భారీగా నష్టం వాటిల్లింది. ఎప్పుడూ లేని విధంగా ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధరలు లేక వేలాది మంది రైతులు నష్టపోయారు.

2024-25 ఆర్థిక సంవత్సరంలో తగ్గుదల ఇలా...

కేటగిరీ	మార్కెట్ పరిస్థితి
చిన్న మార్కెట్‌లు	రూ.5,000 కోట్ల నుంచి రూ.2,200 కోట్లకు
రిజిస్ట్రేషన్స్ రెవెన్యూ	రూ.429 కోట్ల లక్ష్యం.. వచ్చింది రూ.280 కోట్లు
చిన్న పరిశ్రమలు	రూ.200 కోట్ల నుంచి రూ.105 కోట్లకు
ఉద్యానఫలాలు	రూ.24,857 కోట్ల నుంచి రూ.18,600 కోట్లకు
ఇండస్ట్రీస్ నుంచి	రూ.13,064 కోట్ల నుంచి రూ.950 కోట్లకు

రాష్ట్రంలో అరాచక పాలన



పదవులు పొందిన వారిని సత్కరిస్తున్న నాయకులు చిత్రంలో ఆరె శ్యామల, ఉషశ్రీచరణ్, దీపిక



సభకు హాజరైన ప్రజాప్రతినిధులు, నేతలు

- కూటమి హయాంలో బాలికలు, మహిళలకు రక్షణ లేదు
- చంద్రబాబు ఏడాది పాలన అట్టర్ ఫ్లాప్
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల

చిలమత్తూరు: 'రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోంది. మహిళలు, బాలికలకు రక్షణలేకుండా పోయింది. పట్టించుకునే వారే లేకపోవడంతో రోజుకో చోట బాలికలు, మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి'' అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల ధ్వజమెత్తారు. శుక్రవారం హిందూపురంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక నిర్వహించిన 'పదవులకు పట్టాభిషేకం' కార్యక్రమానికి శ్యామల, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గవ్యాప్తంగా పార్టీ పదవులు పొందిన నేతలను సన్మానించారు. అనంతరం జరిగిన సభలో ఆరె శ్యామల మాట్లాడారు. 40 ఏళ్ల అనుభవమంటూ గొప్పలు చెప్పే చంద్రబాబు ఏడాది పాలన అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. ఏడాదిలోనే రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా చేశారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళాభ్యుదయానికి పాటుపడ్డారని, నేడు మహిళలు ఇంట్లోంచి బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితులు తెచ్చారన్నారు. ఏడాది పాలనలో ప్రజలకు ఏమీ చేయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... చేయని సంక్షేమం, అభివృద్ధిపై నివేదికలు, సమీక్షలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. ఆయన తమ ఏడాది పాలనలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, హిందూపురంలో మహిళల అత్యాచారం మొదలు, దళిత బాలికపై సామూహిక అత్యాచారం, కుప్పంలో మహిళను చెట్టుకు కట్టేసిన ఘటనలపై నివేదికలిస్తే బాగుంటుందన్నారు.

సవిత తనస్థాయి తెలుసుకోవాలి..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడుతున్న మంత్రి సవిత.. ముందు తన స్థాయి తెలుసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. 1945లో మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పిన హాఫ్ నాలెడ్జ్ మంత్రి సవిత కూడా రాజకీయాల గురించి మాట్లాడటం చూసి జనమే నవ్వుకుంటున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో లేకపోయినా... ఆడబిడ్డల రక్షణ కోసం రోడ్డెక్కారని, వారికి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. చిలమత్తూరు మండలంలో అత్తాకోడలిపై అత్యాచారం జరిగితే ఆ కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించారని గుర్తుచేశారు. కల్లితండాలో వీరజవాన్ మురళీనాయక్ కుటుంబానికి రూ.25 లక్షలు ఇచ్చి ఆర్థికంగా ఆదుకున్నారన్నారు. కానీ దళిత బాలికపై అత్యాచారం జరిగితే హోంమంత్రిగా ఉన్న అనిత పరామర్శించిన పాపాన పోలేదని విమర్శించారు.

సైనికుల్లా పనిచేయండి..

హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు రమేష్ రెడ్డి, హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపిక మాట్లాడుతూ.. పదవులు పొందిన వారంతా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు సైనికుల్లా పనిచేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రతి నాయకుడు, కార్యకర్తకూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి, రాష్ట్ర నేత వజ్రభాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, వైఎస్సార్ సీపీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్‌ఏ శివ తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్రకు పోటెత్తిన వరద

- 51,261 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 40 టీఎంసీలకు చేరువగా నీరు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తింది. బుధవారం 19,265 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో గురువారం 43,706, శుక్రవారం సాయంత్రానికి 51,261 క్యూసెక్కులకు పెరిగింది. శనివారం ఉదయానికి మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. డ్యాంలో నీరు 40 టీఎంసీలకు చేరువగా చేరింది. తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో డ్యాం ఎగువన నిర్మించిన అప్పర్‌తుంగా ప్రాజెక్ట్ (గాజనూరు జలాశయం) నిండటంతో 30 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దీనికి తోడు రిజర్వాయర్ పరిసరాల్లో ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో మరింత పెరుగుతున్నట్లు తుంగభద్ర బోర్డు అధికారులు వెల్లడించారు.

- గతేడాది 33 క్రస్ట్ గేట్లలో 19వ క్రస్ట్ గేటు కొట్టుకుపోవడం, మిగిలిన 32 గేట్లు కూడా దెబ్బతినడం వల్ల నిపుణుల సూచనల మేకు వాటిని మార్చాలని టీబీ బోర్డు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో గేట్ల అంచు వరకు 80 టీఎంసీల నీరును మాత్రమే నిల్వ చేసి కాలువలకు వదులుతారు. ఎక్కువ వరద వస్తే నదికి వదిలేయనున్నారు. ఒక డ్యాంలో నీటి నిల్వ 40 టీఎంసీలకు తగ్గిన తర్వాత కొత్త గేట్లను అమర్చనున్నట్లు సమాచారం.
- ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ 1,633 అడుగులకు గాను 1610.52 అడుగులకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 51,261 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 256గా ఉంది. మొత్తం నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 38.610 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



టీబీ డ్యాంలో చేరిన వరద నీరు

క్లుప్తంగా

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



వైద్యులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చేసే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ మహేష్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం హెచ్చరించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై శుక్రవారం ధర్మవరంలోని ఆర్డీఓ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులతో వారు సమావేశమై మాట్లాడారు. భ్రూణ హత్యలు, లింగ నిర్ధారణ వల్ల ఆడ శిశువుల జననాల రేటు గణనీయంగా పడిపోతోందన్నారు. పీసీ–పీఎన్‌డీటీ యాక్ట్–1994 మేరకు లింగ నిర్ధారణ ప్రోత్సహించిన ఆస్పత్రుల వైద్యులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ధర్మవరం అర్బన్: స్థానిక బడేసాహెబ్ వీధిలో నివాసముంటున్న కురాకుల కృష్ణమూర్తి ఇంట్లో చోరీ జరిగింది. కుటుంబసభ్యులతో కలసి మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కృష్ణమూర్తి మరో ఊరికి వెళ్లారు. శుక్రవారం తిరిగి వచ్చారు. అప్పటికే ఇంటికి వేసిన తాళం బద్ధలుగొట్టి బీరువాలోని మూడు తులాల బంగారు మాంగల్యం గొలుసు, రూ.2వేలు నగదు, ఇంటి బయట నిలిపిన ద్విచక్రవాహనం అపహరించుకెళ్లినట్లు గుర్తించి సమాచారం ఇవ్వడంతో వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఎస్సీ మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

హిందూపురం: స్థానిక నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ముక్కిడిపేటలోని పాత ప్రభుత్వ హాస్టల్ భవనంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మహిళలకు కుట్టుపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్‌సీ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండు నెలల కాల వ్యవధి ఉన్న ఈ శిక్షణకు 16 నుంచి 40 ఏళ్ల కలిగిన మహిళలు అర్హులు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రముఖ గార్మెంట్స్ పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పిస్తారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 23వ తేదీ లోపు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, రెండు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 90529 01657లో సంప్రదించవచ్చు.

‘మురుగు’నూ వదల్లేదు!

- డ్రెయినేజీ పనులు చేయకుండానే రూ.80 లక్షల స్వాహాకు యత్నం
- సింగిల్ టెండర్, ఎక్సెస్‌కు ప్రీ ఆడిట్ చేయబోమన్న జిల్లా ఆడిట్ అధికారులు
- తాజాగా మున్సిపాలిటీ నుంచి రూ.84 లక్షల చెక్కు ఇప్పించుకునే ఎత్తుగడ



చిలమత్తూరు: హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో డ్రెయినేజీల్లో పూడికతీత పేరుతో నిధుల స్వాహాకు తెరలేపిన వైనం వెలుగు చూసింది. చేయని పనులకు పాత పనుల వివరాలు జోడించి బిల్లులు కొట్టేసే ప్రయత్నం కాస్త ఆడిట్ అధికారుల అప్రమత్తతో బెడిసి కొట్టింది. వివరాల్లోకి వెళితే... హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో నాలుగు శానిటరీ డివిజన్లు ఉండగా ఒక్కో డివిజన్ పరిధిలో రూ.20 లక్షలు చొప్పున మొత్తం రూ.80 లక్షలతో డ్రెయినేజీల్లో పూడిక తీత పనులకు 8 నెలల క్రితం టెండర్లు పిలిచారు. టెండర్ దక్కించుకునేందుకు పుట్టపర్తికి చెందిన ఓ వ్యక్తితో పాటు హిందూపురం నివాసి కూడా పోటీ పడ్డారు. అయితే కొన్ని బెదిరింపుల కారణంగా పుట్టపర్తికి చెందిన కాంట్రాక్టర్ తన టెండర్‌ను విత్ డ్రా చేసుకోవడంతో సింగిల్ టెండర్ ద్వారా హిందూపురానికి చెందిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. అంచనాకు మించి 4.90 శాతం ఎక్కువకు టెండర్ ఖరారు చేశారు. ఈ క్రమంలో సింగిల్ టెండర్లు, ఎక్సెస్ కోట్‌ను ఆమోదించరాదంటూ మున్సిపల్ చైర్మన్‌కు కౌన్సిలర్లు డిసెంట్ నోటీసు అందజేశారు. ఈ నోటీసును ఉన్నతాధికారులకు పంపకుండా అప్పటి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తొక్కిపెట్టి కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. అయితే ఎలాంటి పనులు చేయకుండానే పాత పనుల ఫొటోలు, వివరాలు జోడించి బిల్లులు చేసుకునే ప్రయత్నం చేయడంతో అప్పటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం వ్యతిరేకించారు.

నిరాకరించిన ఆడిట్ అధికారులు..

బిల్లులు చేసేందుకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుబ్రహ్మణ్యం అడ్డుగా నిలవడంతో ఈఎన్‌సీ పబ్లిక్ హెల్త్‌కు సరెండర్ చేయించారు. ఈ మొత్తం ప్రక్రియ ఎమ్మెల్యే కార్యాలయం నుంచే జరిగినట్లుగా ఆరోపణలున్నాయి. అనంతరం పనులు పూర్తయ్యాయని, 4.90 శాతం ఎక్సెస్ అమౌంట్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రీ ఆడిట్ కోసమని జిల్లా కేంద్రంలోని ఆడిట్ కార్యాలయానికి పంపారు. అయితే సింగిల్ టెండర్, ఎక్సెస్ కోట్‌ను ఒప్పుకోబోమని ఆడిట్ అధికారులు తేల్చిచెప్పడంతో వెనువెంటనే ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఒత్తిళ్లు తీసుకెళ్లారు. అయినా నిబంధనలకు వ్యతిరేకంగా తాము పని చేయలేమంటూ ఆడిట్ అధికారులు స్పష్టం చేస్తూ ఆ ప్రతిపాదనలను వెనక్కు పంపారు.

చెక్కు రూపంలో బిల్లు పొందే ఎత్తుగడ..

ప్రీ ఆడిట్ చేయించుకుని సీఎఫ్ఎంఎస్ (కాంప్రహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టం) ద్వారా బిల్లులు పొందాలనుకుని భంగపడిన కాంట్రాక్టర్... తాజాగా కమిషనర్‌ను బురిడీ కొట్టించి రూ.84 లక్షలకు చెక్కు పొందేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. గతంలో మున్సిపల్ కార్మికులు చేసిన పనుల వద్ద తాజాగా తీసిన ఫొటోలు జతపరిచి పనులు చేసినట్లుగా చూపించడమే కాక, కొన్నింటికి పాత ఫొటోలనే వాడి జతపరిచిన ఫైల్‌ను కమిషనర్ వద్ద పెట్టి బిల్లులను చెక్కు రూపంలో పొందేలా పావులు కదిపాడు. ఈ మొత్తం తతంగాన్ని ఎమ్మెల్యే కార్యాలయం వెనుక నుంచి నడిపిస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. అయితే బిల్లులను ఏ కోశానా చెక్కు రూపంలో చెల్లించేందుకు వీల్లేదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. కాగా, గతంలోనూ ఇదే కాంట్రాక్టర్ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని 2013లో దాదాపు రూ.22 లక్షల రికవరీకి అప్పటి అధికారులు ఆదేశించారు. 12 ఏళ్లు గడిచినా ఆ నగదును ఆయన తిరిగి చెల్లించలేదని తెలుస్తోంది. అయినా మున్సిపల్ అధికారులు మళ్లీ సింగిల్ టెండర్ ద్వారా పనులు కట్టబెట్టడం అనుమానాలకు తావిస్తోంది.

పాలనలో ‘కూటమి’ విఫలం

- సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్



మాట్లాడుతున్న వేమయ్య యాదవ్

సోమందేపల్లి: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ విమర్శించారు.. శుక్రవారం లక్ష్మీ వేంకటేశ్వర కల్యాణ మంటపంలో 8వ మండల మహాసభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాల పేరిట గద్దెనెక్కిన చంద్రబాబు.. ఏడాది పూర్తయినా ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ అమలు చేయలేకపోయారన్నారు. ఏడాది తర్వాత అనేక నిబంధనలతో అరకొరగా తల్లికి వందనం నిధులు విదిల్చారన్నారు. కియాలో రూ.కోట్ల అక్రమ సంపాదన పొందుతూ టీడీపీ నాయకులు ఆర్థికంగా బలపడుతున్నారని ఆరోపించారు. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా తమిళనాడు ప్రాంతానికి చెందిన వారికి కియా అనుబంధ పరిశ్రమల్లోకి తీసుకోవడం దారుణమన్నారు. పెత్తనం అంతా వారిదే అయిపోయిందని తెలిపారు. చేనేతలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కదిరప్ప, ఉపాధ్యక్షుడు బాలస్వామి, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కూడేరు: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. కూడేరుకు చెందిన మంగల సాయినాథ్ (33)కు భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుల వృత్తితో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపం చెందిన ఆయన శుక్రవారం సాయంత్రం ఇంటి వరండాలో చీరతో ఉరి వేసుకున్నాడు. గమనించిన రాజేశ్వరి వెంటనే స్థానికుల సాయంతో కాపాడి అపస్మారక స్థితిలో ఉన్న భర్తను 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కంటిపాప కోసం.. కన్నతండ్రి శోకం

- షాఫియా ఆచూకీ దొరికేనా?
- ఓ వ్యక్తి, మరో మహిళ ప్రమేయంపై అనుమానాలు
- పట్టించుకోని పోలీసులు.. కేసులో కనిపించని పురోగతి



షాఫియా (ఫైల్)

సోమందేపల్లి: ఇంటి సమీపంలో ఆడుకుంటున్న ఆరేళ్ల చిన్నారి షాఫియా అదృశ్యమై నెలలు గడిచినా.. నేటికీ ఆచూకీ కనిపించలేదు. కొద్ది రోజులు ముమ్మరంగా సాగిన పోలీసుల దర్యాప్తు ఆ తర్వాత ఆగిపోయింది. దీంతో నిరుపేద తండ్రి తన కంటిపాప కోసం కన్నీరు మున్నీరవుతున్నాడు.

ఆడుకుంటూ అదృశ్యం..

పెనుకొండ దర్గాపేటకు చెందిన ఖలీల్.. హోటల్ నడుపుతూ జీవనం సాగించేవాడు. ఆయనకు నలుగురు కుమార్తెలు కాగా, వారిలో ఆరేళ్ల వయస్సున్న చిన్న కుమార్తె షాఫియా 2023 జూన్ 12న ఇంటి సమీపంలో ఆడుకుంటూ అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం దక్కలేదు. దీంతో ఖలీల్ తన బిడ్డ ఆచూకీ కనిపెట్టాలని స్థానిక పోలీస్ స్టేషన్‌తో పాటు ఎస్పీ కార్యాలయానికి కూడా వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు కూడా తొలుత ఇతర రాష్ట్రాలకు వెళ్లి మరీ పాప ఆచూకీ కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో ఓ మహిళ ఏఎస్ఐకి కేసు అప్పజెప్పి చేతులు దులుపుకున్నారు.

అనుమానితులను ప్రశ్నించని పోలీసులు..

షాఫియా అదృశ్యం వెనుక ఆ చిన్నారి తల్లి సోదరి భర్త బాబ్జాన్ ప్రమేయం ఉన్నట్లు అందరూ అనుమానిస్తున్నారు. ఎందుకంటే షాఫియా అదృశ్యమైన ఘటనకు ఆరు నెలల క్రితం అతను తన బిడ్డను దర్గాపేటకు చెందిన ఓ మహిళ ప్రమేయంతో అమ్మినట్లు ఇటీవల బహిరంగంగా ఒప్పుకున్నాడు. షాఫియాను ఎత్తుకొస్తే అమ్మివేద్దామని సదరు మహిళ కోరినా... తాను ఒప్పుకోలేదని అతను చెప్పాడు. అయితే బాబ్జాన్‌తో పాటు అతను చెబుతున్న మహిళనూ పోలీసులు విచారిస్తే.. తమ పాప ఆచూకీ లభిస్తుందని షాఫియా తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇటీవల ఎస్పీ రత్న పాత కేసుల దర్యాప్తు ముమ్మరం చేసి విచారణ పూర్తి చేస్తున్నారని, ఈ క్రమంలోనే తన బిడ్డ అదృశ్యమైన కేసునూ ఓ సారి పరిశీలించి ఆచూకీ కనుగొనాలని ఖలీల్ కోరుతున్నారు.

వృద్ధురాలి బలవన్మరణం

మడకశిర రూరల్: మండలంలోని ఆమిదాలగొంది గ్రామానికి చెందిన నరసమ్మ(64) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... తన మనుమరాలికి స్వగ్రామంలోనే ఓ యువకుడికి ఇచ్చి నరసమ్మ వివాహం జరిపించింది. ఈ క్రమంలో దంపతుల మధ్య మనస్పర్థలు చోటు చేసుకుని మనవరాలు ఇంటికి వచ్చేసింది. దీనికి తోడు అనారోగ్యం ఇబ్బంది పెడుతుండడంతో జీవితంపై విరక్తి చెందిన నరసమ్మ... గురువారం ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. సాయంత్రమైన ఆమె ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో ఆమె మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

చీటింగ్ కేసు నమోదు

కదిరి టౌన్: మామిడి కాయల క్రయవిక్రయాల్లో మోసానికి పాల్పడిన వ్యాపారిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. కదిరిలోని జామియా మసీదు వీధికి చెందిన మహబూబ్‌బాషా రైతుల తోటల్లో ఫలసాయాన్ని కొనుగోలు చేసి, ఇతరులకు విక్రయించేవాడు. ఈ క్రమంలో ఇటీవల తాను కొనుగోలు చేసిన మామిడి కాయలను కదిరి పట్టణానికి చెందిన జితిన్‌కు రూ.18 లక్షలకు విక్రయించాడు. మరుసటి రోజు డబ్బు చెల్లిస్తానని నమ్మబలికిన జితిన్ తర్వాత ముఖం చాటేసాడు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తాను మోసపోయినట్లుగా నిర్ధారించుకున్న మహబూబ్‌బాషా ఫిర్యాదు మేరకు జితిన్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గొల్లహట్టి సమీపంలో చైన్ స్నాచింగ్

రొళ్ల: మండలంలోని ఎంఆర్ గొల్లహట్టి గ్రామ సమీపంలో ఓ దుండగుడు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. అగళి మండలం హళ్లికెర గ్రామానికి చెందిన దొడ్డక్క కర్ణాటకలోని బీరనపల్లిలో కుమార్తెను పలకరించి శుక్రవారం తన కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైంది. రొళ్ల మండలం ఎంఆర్ గొల్లహట్టి గ్రామ సమీపంలోకి చేరుకోగానే వెనుకనే మరో ద్విచక్ర వాహనంపై అనుసరిస్తూ వచ్చిన దుండగుడు దొడ్డక్క మెడలోని నల్లపూస దండలో రూ.70 వేలు విలువ చేసే 7 గ్రాముల బరువున్న బంగారు గుండ్లను లాక్కొని ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కదిరి టౌన్: స్థానిక నల్లగుట్ట వీధికి చెందిన ఓ యువతి శుక్రవారం ఉదయం నుంచి కనిపించడం లేదంటూ ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. మారుతీ నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్లాపై అనుమానాలు వ్యక్తం చేస్తూ బాధితుడు ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా కేసు నమోదు చేసి, విచారణ చేపట్టామని పేర్కొన్నారు.

అనంత, కడప జట్ల విజయం

అనంతపురం సెంట్రల్: ఏసీఏ, డీసీఏ సంయుక్త ఆధ్వర్యంలో రాయలసీమ క్రికెట్ గ్రౌండ్ వేదికగా శుక్రవారం నిర్వహించిన సౌత్‌జోన్ సీనియర్ టీ20 క్రికెట్ మ్యాచ్‌లో అనంత, వైఎస్సార్ కడప జిల్లాల జట్లు గెలుపొందాయి. తొలిమ్యాచ్‌లో అనంతపురం, చిత్తూరు జట్లు తలపడగా తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసింది. జట్టులో జ్ఞానేశ్వర్ 38 పరుగులు సాధించాడు. అనంతపురం బౌలర్లలో కామిల్ 3, రాజకుళ్లాయప్ప 3 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 17.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సునాయాశంగా సాధించింది. జట్టులో వినయ్‌కుమార్ 36 బంతుల్లో మూడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 53 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

- మధ్యాహ్నం నిర్వహించిన మరో మ్యాచ్‌లో వైఎస్సార్ కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసి కడప జట్టు 20 ఓవర్లలో 152 పరుగులు చేసింది. జట్టులో జహీర్ అబ్బాస్ 51 బంతుల్లో 5ఫోర్లు, ఆరు సిక్సర్లతో 78 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. నెల్లూరు జట్టులో భరత్ 5 వికెట్లు, భార్గవ్ 3 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 15.3 ఓవర్ల వద్ద 100 పరుగులకు చతికిలపడింది. 52 పరుగులతో కడప జట్టు విజయం సాధించింది.

బ్యూటీషియన్ కోర్సుపై శిక్షణ

అనంతపురం సెంట్రల్: బ్యూటీషియన్ కోర్సుపై జిల్లా కేంద్రంలోని ఎస్కేయూ సమీపంలో ఉన్న రూడ్‌సెట్ సంస్థలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 18 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు, రేషన్‌కార్డు కలిగిన గ్రామీణ నిరుద్యోగ మహిళలు అర్హులు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం ఉంటుంది. పూర్తి వివరాలకు 94925 83484లో సంప్రదించవచ్చు.

తాగునీటి సమస్యపై మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలియజేస్తున్న మహిళలు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో 250 కుటుంబాలకు గాను సుమారు 1000 మంది దాకా జనాభా ఉందన్నారు. కాలనీలో నెలకోసారి మాత్రమే నీరు సరఫరా చేస్తున్నారన్నారు. తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నామన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ప్రతి ఒక్కరికీ ఎన్‌సీడీ సర్వే



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం

పుట్టపర్తి అర్బన్: అసంక్రమిత వ్యాధులను అరికట్టి అందరినీ ఆరోగ్యవంతుల్ని చేయడానికి ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజ్) సర్వే నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం పేర్కొన్నారు. ఎన్‌సీడీ సర్వేపై పుట్టపర్తిలోని మండల సమాఖ్య కార్యాలయంలో వైద్యాధికారులు, సీహెచ్ఓలు, వైద్య ఆరోగ్య సిబ్బందికి శుక్రవారం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్‌సీడీ పరీక్షలు పక్కాగా చేపట్టాలన్నారు. ప్రత్యేకంగా నోటి, రొమ్ము పరీక్షలను నిర్వహించాలన్నారు. ప్రధానంగా ఈ పరీక్షలు గర్భిణులు, బాలింతలు, యుక్త వయస్సుల వారి ఆరోగ్యంపై నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్రనాయక్, డీపీఓ నాగరాజు, నూర హెల్త్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు శివ, శివశంకర్, శ్వేత, డాక్టర్ సరిత, డాక్టర్ ఆశ్రిత, తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్ష కేంద్రాల్లో తనిఖీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కంటి పరీక్ష కేంద్రాలను డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం శుక్రవారం తనిఖీలు చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కింద ఆప్తాలమిక్ డాక్టర్లు, సిబ్బంది అర్హత సర్టిఫికెట్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో అందజేసి రిజిస్టర్ చేసుకోవాలని నేత్రాలయ, అక్షయ కంటి పరీక్ష కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. బోర్డుల్లో ఆపరేషన్లు చేయనున్నట్లు ప్రదర్శించరాదని వాటిని తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె వెంట జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్రనాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మన్, డిప్యూటీ డెమో ఫకృద్దీన్ తదితరులు ఉన్నారు.

బాలిక అదృశ్యం

బెళుగుప్ప: మండలంలోని కోనంపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలిక గురువారం నుంచి కనిపించడం లేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం ఉదయం తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రామదాసు తెలిపారు.

మహిళ కిడ్నాప్.. కేసు నమోదు

బెళుగుప్ప: మహిళ కిడ్నాప్‌నకు గురైందంటూ కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బెళుగుప్ప పీఎస్ ఎస్ఐ శివ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గంగవరం గ్రామానికి చెందిన ఓ మహిళను కళ్యాణదుర్గం మండలం ఒంటిమిద్ది గ్రామానికి చెందని వంశీ, ఆయన కుటుంబసభ్యులు గురువారం కిడ్నాప్ చేశారంటూ బాధితురాలి కుటుంబసభ్యురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ అనంతరం కిడ్నాప్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

VOCATIONAL COURSES

■ LM&D (డైరీయింగ్ & పశువిద్య), MLT, MPHW(F), C&T కోర్సులకు 2025 సం॥ అడ్మిషన్స్ జరుగుచున్నవి. అర్హత : 10th ఆపైన, హాస్టల్ కలదు. సెల్: 9985566783 [SCA25005150]

B.Sc (Nursing) అడ్మిషన్స్

■ B.Sc (Nursing) లో జాయిన్ కావడానికి Last Date ఈ నెల – 23rd. Government సీట్స్‌కి అడ్మిషన్స్ జరుగుచున్నవి. సంప్ర: G.మురళి, 9030661651, అనంతపురం. [A-1652]

DMLT ADMISSIONS

■ DMLT 2 సంవత్సరముల కోర్సునకు అడ్మిషన్లు జరుగుచున్నవి. Q: ఇంటర్ పాస్ (ఏ గ్రూప్ అయిన) అర్హులైన వారికి స్కాలర్ షిప్ కలదు. # SEEDS కాలేజ్, కమలానగర్, అనంతపురం. సెల్: 9100494926, 9440255034. [SCA 25005127]

GNM అడ్మిషన్స్

■ ఇంటర్మీడియట్‌లో Any Group స్టూడెంట్స్‌కి G.N.M (Nursing) నందు Goverment సీట్స్‌కి అడ్మిషన్స్ జరుగుచున్నవి. Only గర్ల్స్ కాలేజీలో అడ్మిషన్స్ పొందవచ్చు. సంప్ర: G.మురళి, 9030661651,అనంతపురం. [A-1648]

REAL ESTATE

గోడౌన్ బాడుగకు

■ ATP, కమలానగర్‌లో సెల్లార్ గోడౌన్ (12x65 చ॥అ॥) హోల్‌సేల్‌షాపుకు, ఏజెన్సీలకు బాడుగకు ఇవ్వబడును. లోడ్ / అన్‌లోడ్, నీటి సౌకర్యం కలదు. Cell: 9880966520, 8074075776. [A-398]

SERVICES

CHANGE OF NAME

■ I, ASHALATHA RAMASWAMY NAIK (Old Name) W/o MUDE ANANDA BABU NAIK, R/o 13-2-128, Ramchandra Nagar, Near Bus-stand, Anantapur (T&D), A.P. I changed my NAME to ASHALATHA RAMASWAMY. Hence forth, I will be known as ASHALATHA RAMASWAMY W/o MUDE ANANDA BABU NAIK for all purpose. [A-1655]

శ్రీ గాయత్రీదేవి జ్యోతిష్యాలయం

■ ఉచితంగా జ్యోతిష్యం చెప్పబడును. పండిట్ S.V. శాస్త్రి గారు గత 70 సం॥లుగా అనంతపురంలో స్థిరపడి ఉంటున్నారు. స్త్రీ, పురుషులకు ఎటువంటి సమస్యకైనా గాయత్రీ దేవి పూజ చేసి 7 రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపబడును. సెల్: 7676703640. [A-1650]

WANTED

■ మందుల షాపులో పనిచేయుటకు అనుభవం కలిగిన అభ్యర్థులు అర్జెంటుగా కావలెను. సెల్: 7399442222, అనంతపురం. [A-1654]

■ చికెన్ షాపు (అనంతపురం) నందు పనిచేయుటకు Inter/డిగ్రీ చదివిన మరియు అవగాహన కలిగిన వారు సంప్రదించండి. సెల్: 8074429294, 9542093517. [A-870]

■ WANTED FACULTY : IIT & NEET Foundation Course Daily Evening Classes at 6 PM to 9 PM. Interviews on Sunday @ 10 AM - 4 PM. Anantapur. 8008965628. [A-7118]

■ హరేకృష్ణ హోంఏజేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటిపిల్లలను చూసుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్. జీ : 18K. Ph: 9640468899, 9640258899 [SCA25005265]

■ ప్రముఖ కంపెనీ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ పురుషులు కావలెను. అర్హత: 10th – డిగ్రీ, జీతం: 15,000 నుంచి. సంప్ర॥ 9908429239 [G-605]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ నందు అనుభవం కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, మేనేజర్ మరియు టెలికాలర్ కావలెను. కాంటాక్ట్ : సెల్: 7676175083. [SCA25005166]

■ PAYTM WANTED: Boys, FSE's, (జెంట్స్ మాత్రమే) Q: 12th పాస్, శాలరీ: 21K + ఇన్సెంటివ్స్. ఆన్ రోల్ జాబ్. ఫ్రెషర్స్ / EXP. బైక్+ స్మార్ట్ ఫోన్ తప్పనిసరి. జాబ్ లోకేషన్: అనంతపురం, 9441945743. [A-1649]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

■ WANTED TEACHERS : లేపాక్షి మండలం కొండూరు గ్రామంలో గల, A.S.GLOBAL E.M. SCHOOL నందు పనిచేయుటకు అనుభవం గల టీచర్స్ కావలెను. 9848116395, 8341772403. [SCA 25005128]

■ Jobs: కాలేజ్ అడ్మిషన్స్ చేయుటకు టెలికాలర్స్ కావలెను. 2 Years Experience, Qua: ఏదైనా డిగ్రీ, @ టవర్ క్లాక్ దగ్గర, అనంతపురం. Cont : 9494585715 9885196146. [A-1651]

■ Airtel Wifi అనంతపురం పట్టణం నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం: 16500+ ఇన్సెంటివ్స్ ఆండ్రాయిడ్ ఫోన్ + బైక్ + డ్రైవింగ్ లైసెన్స్ ఉండవలెను. ఉమామహేశ్వర రెడ్డి. 9000029003. [A-1653]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ బిల్ ఇన్ ప్రా నందు పనిచేయుటకు, అనుభవం గల టెలికాలర్స్ (స్త్రీలు) & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. టీమ్‌తో వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత. టార్గెట్‌తో పనిలేకుండా ఫిక్స్‌డ్ జీతం ఇవ్వబడును. అడ్రస్: 1వ ఫ్లోర్, సహస్రా అపార్ట్‌మెంట్, బళ్ళారి రోడ్, ATP.సెల్: 8919289902, 8919159081. [A-1646]

■ బెంగళూరులో ప్రముఖ కంపెనీ నందు జాబ్ చేయుటకు టెన్త్ ఇంటర్ ఐటిఐ డిప్లమా డిగ్రీ అర్హత కలిగిన యువతీ యువకులు అర్జెంటుగా కావలెను. గమనిక స్పాట్ జాయినింగ్. శాలరీ 21,000/- మరియు భోజన సదుపాయం కలదు ఇంటర్వ్యూ డేట్స్: జూన్ 21, 22. సంప్ర॥ అడ్రస్: కమలానగర్, S.V. హాస్పిటల్ లైన్, ATP. 88855 32257. [SCA25005271]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

అద్దెకు | అమ్మకం | రియల్ ఎస్టేట్ | ఫర్నిచర్స్ | ఆటోమొబైల్ | కంప్యూటర్స్ | సర్వీసెస్

4 లైన్లు రూ. 270/- | అదనపు లైను రూ. 60/-

ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723, 9494767933
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088
RAYADURG : 9010470185

రామగిరి వాసికి అంతర్జాతీయ గుర్తింపు



నాగశేషు

రామగిరి: మండలంలోని గరిమేకలపల్లికి చెందిన నాగశేషుకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు దక్కింది. 2024కు సంబంధించి జరిగిన నవలల పోటీల్లో ఆయన రచించిన ‘కిలారి’ ఉత్తమ నవలగా ఎంపిక కావడంతో త్వరలో అమెరికాలోని డల్లాస్‌లో నగదుతో పాటు జ్ఞాపికను అందుకోనున్నారు. కాగా, నాగశేషు కర్ణాటకలోని మైసూరులో ఉన్న ముక్త గంగోత్రి యూనివర్సిటీలో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. కంబళ్ల నేత కార్మికుల కష్టాలపై ‘ఏకుదారం’ పేరుతో మొట్టమొదటి సారిగా ఆయన రచించిన నవల బహుళ ప్రాచుర్యం పొందింది. అనంతరం కురుబల ఆరాధ్య దైవం బీరప్ప స్వామి లీలలపై ఓ పుస్తకాన్ని రచించారు. తన ‘కిలారి’ నవలలో కులాల కంటే మానవత్వం ముఖ్యమనే సందేశాన్ని అందజేశారు. ఏటా జరిగే జొన్నలగడ్డ రాంబొట్లు – సరోజమ్మ స్మారక సిరికోన నవలా రచనల పోటీలకు సంబంధించి 2024లో నిర్వహించిన పోటీలకు పరిశీలనార్థం ‘కిలారి’ నవలను ఆన్‌లైన్ ద్వారా సిరికోన సాహితీ అకాడమికి నాగశేషు పంపారు. ప్రాథమిక పరిశీలన తర్వాత మొత్తం 26 నవలలను ఎంపిక చేసి న్యాయనిర్ణేతకు నిర్వాహకులు అందజేశారు. రెండోసారి వడబోత తర్వాత పోటీలో నిలిచిన 6 నవలలను ముగ్గురు న్యాయనిర్ణేతలకు పంపారు. ఇందులో కథావస్తువు, నిర్మాణం, తార్కికత, శైలి, శిల్పం, సామాజిక ప్రయోజనం అనే అంశాలను పరిగణనలోకి తీసుకుని ఉత్తమ నవలగా ‘కిలారి’ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నాగశేషు మాట్లాడుతూ.. త్వరలో అమెరికా వేదికగా పురస్కారాన్ని అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

